క్లుప్తంగా

సచివాలయ రికార్డులు పరిశీలన



వెల్దుర్తి: మండలంలోని మిట్టమీదిపల్లె, శిరిగిరిపాడు-2, వెల్దుర్తి సచివాలయాలతో పాటు ఆయా గ్రామాలలోని మీ సేవా కేంద్రాలను గురువారం డీఎల్‌డీఓ గబ్రూనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించటంతో పాటు వారికి అమలైన సంక్షేమ పథకాలకు బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మారుమూల ప్రాంతాలలోనూ నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట ఎంపీడీఓ డి.ప్రసాద్, ఈఓపీఆర్‌డీ మకట్‌లాల్, పంచాయతీ కార్యదర్శి మాచర్లయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



పిడుగురాళ్ల: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గురువారం జరిగిందని గ్రామీణ ఎస్‌ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని, అతని వంటిపై తెల్లరంగు చొక్కా, తెల్లరంగు పంచ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహానికి సంబంధించి ఎవరైనా ఉంటే పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు 9440796236 నెంబర్‌కు లేదా, ఎస్‌ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ 8099910446 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

పిడుగురాళ్ల: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పిడుగురాళ్ల అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల ప్రాంగణంలో గురువారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉష్ణోగ్రత, ఆక్సిజన్, మండే వస్తువుల వలన ప్రమాదాలు జరుగుతాయని, అటువంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో భయపడకుండా జాగ్రత్తలను పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్ధూ, ఎస్ఎం విజయ్ మోహిత్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో మొసలి కలకలం

నకరికల్లు: వ్యవసాయబావిలో మొసలి సంచరిస్తుండడంతో సమీపంలోని పొలాల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని నర్శింగపాడు గ్రామం నుంచి త్రిపురాపురం వెళ్లే రహదారి పక్కన కాటూరి శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన వ్యవసాయబావిలో మొసలి సంచరిస్తుందన్న విషయం ప్రత్యక్షంగా చూసిన వారు గురువారం అధికారుల దృష్టికి తెచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.నగేష్ హుటాహుటిన సిబ్బందితో నర్శింగపాడు గ్రామానికి చేరుకొని వ్యవసాయబావిని పరిశీలించారు. వ్యవసాయబావిలో సంచరిస్తున్న మొసలిని పట్టుకొని జంతు సంరక్షణా కేంద్రానికి తరలించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

పాలవెల్లువను సద్వినియోగం చేసుకోండి

అచ్చంపేట: జగనన్న పాలవెల్లువ ద్వారా ప్రభుత్వం ఇచ్చే హామీలేని రుణసదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవాలని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం తెలిపారు. జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా మండలంలోని తాళ్లచెరువులోని రైతు భరోసా కేంద్రంవద్ద గురువారం పాల ఉత్పత్తిదారులకు రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాళ్లచెరువు, కస్తల, తాడువాయి గ్రామాలకు చెందిన 8మంది పాలఉత్పత్తిదారులకు నాణ్యమైన గేదెలు కొనుగోలు చేసుకునేందుకు జిల్లా కేంద్ర సహకర బ్యాంకు ద్వారా ఒక్కొక్కరికి రూ.90వేలు అందజేశారు. పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం గ్రామగ్రామాన అమూల్ డైరీలను ఏర్పాటు చేస్తోందన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం షేక్ సలీం మాట్లాడుతూ మండలంలో 850మంది అమూల్ డైరీలకు పాలు పోసే రైతులున్నారని చెప్పారు. వీరు మేలు జాతి గేదెలను కొనుగోలు చేసుకునేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఎలాంటి హామీ లేకుండా అతి తక్కువ వడ్డీకి రుణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ కిక్కురు అన్నమ్మ, పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి, అర్లారెడ్డి, ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవ రాత్రి మహోత్సవాలు

- పలు రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు
- దర్శించుకుని తరించిన భక్తులు



తుమ్మకోట ముత్యాలమ్మ ఆలయంలో మహాచండీ దేవిగా..



పాలువాయి జంక్షన్ కనకదుర్గ దేవస్థానంలో లలితాదేవిగా..



రెంటచింతలలో సంతానలక్ష్మిగా..



పిడుగురాళ్ల కనక దుర్గమ్మ దేవాలయంలో వైష్ణవి దేవిగా..



గురజాలలో సంతానలక్ష్మిగా..

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో నున్న అమ్మవార్ల దేవాలయాలలో శ్రీదేవీ శరన్నవ రాత్రుల మహోత్సవాలు పురస్కరించుకుని పలు ఆలయాలలో అమ్మవార్లు గురువారం వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజ, హోమాలు నిర్వహించారు. తుమ్మకోట గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు మహాచండీ దేవి అలంకారంలో, సత్రశాల వద్ద వేంచేసిన అతిపురాతనమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో భ్రమరాంబిక అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులచే పూజలు అందుకున్నారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు సంతానలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమించారు. పాలువాయిజంక్షన్ వద్ద త్రిశక్తిపీఠంగా విరాజిల్లుతున్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో కనకదుర్గమ్మ అమ్మవారు లలితాదేవి అలంకారంలో, లక్ష్మీదేవి వరలక్ష్మీ అలంకారంలో, సరస్వతి దేవి కామాక్షి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు మహాన్నదానం చేపట్టారు. రాత్రిళ్లు మహిళలు పెద్ద సంఖ్యలో బతకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. సత్రశాల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, దేవస్థానాల అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, యేచూరి సాంబశివరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంతాన లక్ష్మి అలంకరణలో...

గురజాల: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారు సంతాన లక్ష్మిగా, పాతపాటేశ్వర అమ్మవారి దేవాలయంలో, లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో పలు ఏరియాల్లో అమ్మవార్లు గురువారం పలు అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోతమిషన్ సెంటర్, వికలాంగుల కాలనీల్లో బతుకమ్మను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవారు గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని భవానీనగర్‌లో వేంచేసియున్న కనక దుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో అమ్మవారు వైష్ణవి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మంగారి దేవాలయంలోని అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోని అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అమ్మవారు మోహినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు దేవాయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమచ్చారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అమ్మవారికి ఎమ్మెల్యే కాసు ప్రత్యేక పూజలు

దాచేపల్లి: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా గురువారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ వీర్ల అంకమ్మతల్లి, శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరి, శ్రీ కనకదుర్గమ్మతల్లి అమ్మవార్లను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దర్శించుకున్నారు. తొలుత రెడ్లబజార్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద ఎమ్మెల్యే కాసు పూజలు చేశారు. కమిటీ సభ్యులు కొలా శ్రీనివాసరావు, గాదె రామకృష్ణారెడ్డి, కొలా రవీంద్రరెడ్డి, కొలా నరసింహారెడ్డి తదితరులు ఎమ్మెల్యే కాసును సన్మానించారు. కనకదుర్గమ్మ తల్లి దేవాలయం ఆలయ ధర్మకర్త పల్లపు వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే కాసుని సన్మానించారు.



మార్కెట్‌యార్డు వద్ద కనకదుర్గమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాచవరంలో ధనలక్ష్మిగా అమ్మవారి అలంకరణ

ధనలక్ష్మీ నమోస్తుతి...

మాచవరం: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారు పలు అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. మాచవరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో ధనలక్ష్మిగా, శివాలయంలో భ్రమరాంభ అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా, గంగిరెడ్డిపాలెం గ్రామంలోని బ్రహ్మంగారి దేవాలయం వద్ద బాలత్రిపుర సుందరీదేవిగా, చెన్నాయపాలెం గ్రామంలోని శ్రీరేణుకా అమ్మవారి దేవాలయంలో శ్రీలలితాదేవిగా ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆర్బీకేలలో నానో యూరియా లభ్యం

దుర్గి: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు సుమారు రూ. 2400 కోట్ల నిధులు మాచర్ల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారన్నారు. రూ. 600కోట్లతో దావుపల్లి నుంచి నాగార్జున సాగర్, నడికూడి నుంచి మాచర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆర్బీకేలలో నానో యూరియా అందుబాటులో ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యధికంగా పంట బీమా లబ్ధి దుర్గి మండల రైతులకు చేకూరిందన్నారు. ఆత్మకూరు సర్పంచ్ ప్రమాణ స్వీకార సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ జోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా నానో యూరియా బాటిళ్లను అందజేశారు.

22న మెగా కంటి వైద్య శిబిరం

రెంటచింతల: స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 22న శంకర కంటి ఆస్పత్రి, పెదకాకాని వారి సౌజన్యంతో రూరల్ హోమ్ ఫౌండేషన్, అమెరికా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు గుండా జనార్దన్‌రావు గురువారం తెలిపారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటర్‌కార్డు జిరాక్స్‌లను, కుటుంబ సభ్యుల సెల్ ఫోన్ నంబర్‌ను తీసుకురావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9866025589, 9666677504 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం.. ఆరోగ్య సురక్ష లక్ష్యం

- పలు గ్రామాల్లో జగన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
- ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందజేత



జమ్మలమడకలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పర్యవేక్షిస్తున్న ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

మాచర్ల రూరల్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నెలకొల్పేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా తీసుకొచ్చి ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని జమ్మలమడక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో శిబిరాలు ఏర్పాటు చేసి ఆధునిక యంత్రాలతో పాటు స్పెషలిస్టు వైద్యులను సైతం పల్లెలకు తీసుకొచ్చి పరీక్షలు జరిపి ఉచితంగా మందులిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరిమళ మనీషా, సర్పంచ్‌లు ముక్కా గురవయ్య, వెంకయ్య, ఎంపీడీఓ సరోజనీదేవి, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, వైద్యులు రేవతి, ప్రదీప్, వెస్లి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులున్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల వద్దకు వైద్య సేవలు తీసుకువచ్చేందుకు అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి కోరారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు నర్రా కృష్ణారెడ్డి,



మెడికల్ ఆఫీసర్లను సన్మానిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

వి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 12 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసి 5,026 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను అందచేసినట్లు మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం ఎంపీపీ దాసరి చౌడేశ్వరి మెడికల్ ఆఫీసర్లును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. సీహెచ్‌ఓ పూజల నాగేశ్వరరావు, సూపర్ వైజ ర్ ఖాసిం, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య సిబ్బందికి సన్మానం..

మాచవరం: ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బంది, బృందాలు అందించిన సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సేవలు అందించిన డాక్టర్లు చక్రవర్తి, ప్రసాదరావు, అన్వేష్, చంద్రహాసితలను గురువారం సన్మానించారు. మండలంలో మొత్తం సుమారు 5710 మందికి వైద్య పరీక్షలు అందించినట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారుమూల తండాలలో సైతం..

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మారుమూల ప్రాంతాలలోని తండాలలో సైతం నిర్వహించటం సంతోషకరమని జెడ్పీటీసీ సభ్యుడు రూప్లీ బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపుల్లారెడ్డిపురం సచివాలయ పరిధిలోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ముందుకు అడుగులు వేస్తున్నారన్నారు. గ్రామ సర్పంచ్ బూడిద వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ప్రసాద్, వైద్యాధికారులు కౌసిక్, థెరిస్సా, మహతి, ఆశీర్వాదం, శ్రీరామ్, నిజాముద్దీన్, ఈఓపిఆర్‌డి మకట్‌లాల్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రూప్లీ బాలునాయక్

అభివృద్ధి పథంలో గుత్తికొండ

- రూ. 9.13 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాలకు రూ.42 కోట్లు
- రూ.2.60 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వంలో మహిళలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: రూ. 51 కోట్లతో గుత్తికొండ గ్రామాన్ని అభివృద్ధి చేశామని, రాబోయే ఒక్క సంవత్సరంలో గుత్తికొండ రూపురేఖలనే మార్చేస్తామని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలో సచివాలయం-1లో మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల్లో రూ. 9. 13 కోట్లతో గుత్తికొండను అభివృద్ధి చేశామన్నారు. గత ప్రభుత్వం సీసీ రోడ్లకు రూ. 2. 50 కోట్లు, స్కూల్‌కు రూ. 19 లక్షలు, తాగునీటికి రూ. 18 లక్షలు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీసీ రోడ్లకు రూ. 2. 70 కోట్లు, మంచినీటి కోసం రూ. 2.60 కోట్లు, స్కూల్స్ కోసం రూ. 2. 69 కోట్లు , సచివాలయాలు రూ. 65 లక్షలు, ఆర్బీకేలు రూ. 43 లక్షలు, విలేజ్ హెల్త్ క్లినిక్ రూ. 20 లక్షలు, ముస్లీం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ రూ. 25 లక్షలు ఇలా రూ.9.13 కోట్లతో శాశ్వత భవనాలను నెలకొన్పడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయడు వ్యవసాయ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ఐదు దఫాలుగా చేస్తానని, చివరకు మూడు దఫాలల్లో కూడా రుణమాఫీ చేయకుండా ఎగొట్టాడని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా రూ.12,500 ఇస్తానని చెప్పి, మరలా అదనంగా రూ. 1000 కలిపి రూ. 13500 పొలం ఉన్న అర్హత కలిగిన రైతు అకౌంట్‌లో జమ చేస్తున్నారని ఆయన అన్నారు. పల్నాడులో పెద్ద గ్రామమైన పిడుగురాళ్లను చివరి గ్రామమైన గుత్తికొండను అభివృద్ధిలో ముందుంచామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధివైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, నల్లబోలు రామారావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సాతులూరి బాబు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వాలునాయక్, ఎంపీటీసీలు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, గ్రామ కన్వినర్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు బండ్ల రామారావు, రామ కోటేశ్వరరావు, కావూరి రామాంజనేయులు పాల్గొన్నారు.

రూ.250కోట్లతో అభివృద్ధి చేశాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



దాచేపల్లిలో పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.250కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీలో రూ.80లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ...లక్ష జనాభా ఉన్న దాచేపల్లి మండలంలో గతంలో కేవలం ఒక్క పీహెచ్‌సీ మాత్రమే ఉందని, గత పాలకులు ప్రజల ఆరోగ్యంను పూర్తిగా విస్మరించారని చెప్పటంలో సందేహంలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దాచేపల్లి, నడికుడి, గామాలపాడులో కొత్తగా పీహెచ్‌సీలు మంజూరు చేయించామని ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పీహెచ్‌సీ భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని ఆయన పేర్కొన్నారు. నగర పంచాయతీ ఏర్పడిన మూడేళ్లలో దాచేపల్లిలో రూ.200కోట్లతో సంక్షేమం అమలు చేసి, మరో రూ.50కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేసుకుంటూ ముందుకెళుతున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న టాప్-5 నియోజకవర్గాల్లో గురజాల ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతోనే వెనుకబడిన ఈ ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకురాగలిగామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని, మండల కన్వీనర్ కోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురజాల ఆర్డీఓ కె.అద్దెయ్య బదిలీ

గురజాల: రెవెన్యూ డివిజన్ అధికారి కె.అద్దెయ్య బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురజాల ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న అద్దెయ్య జనరల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌సీ బి) డిపార్టుమెంట్‌కు బదిలీపై వెళ్లారు. గురజాల ఆర్డీఓగా జి.వి. రమాకాంత్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు పిల్లలగడ్డలో జగనన్న ఆరోగ్య సురక్ష

పిడుగురాళ్ల: పట్టణంలోని మారుతీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 16వ సచివాలయం సంబంధించిన ప్రజలకు శుక్రవారం పిల్లల గడ్డలోని శివాలయం వద్ద గల ఎంపీపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

సానుభూతి కోసం పాకులాడుతున్న టీడీపీ నేతలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్



ఆత్మకూరు సర్పంచ్ ప్రమాణ స్వీకార సభలో ప్రసంగిస్తున్న పీవీఆర్

దుర్గి: గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి అవినీతికి పాల్పడిన మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును టీడీపీ నాయకులు, సానుభూతితో తమకు లబ్ధి చేకూరుతుందని పగటి కలలు కంటున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ జోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు సర్పంచ్ ప్రమాణ స్వీకార సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షత వహించారు. పంచాయతీ సెక్రటరీ అంబారావు, నూతన సర్పంచ్ బొబ్బ నాగిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. పీవీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాచర్ల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికై రికార్డు సాధించిందన్నారు. ఈ ఘనత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలదేనన్నారు. రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఐదవ సారి గెలిపించుకుందామన్నారు. జడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద, ఎండీపీఓ కె.సమతావాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, ఏఓ వై.అమీర్‌రెడ్డి, ఏఈ వెలుగొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కసిరెడ్డి శాంతిరెడ్డి, మద్దికర ఆదిరెడ్డి, జక్కా రమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి

మాచవరం: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత మండల పరిషత్ ద్వారా రూ.2.53 కోట్ల నిధులతో మండలంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధి ఎంతో కృషి చేసినట్లు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, ఎంపీడీఓ యు.వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్, విద్యుత్ , వ్యవసాయ, విద్య, ఆరోగ్య, మాతాశిశు సంక్షేమం, ఎన్ఆర్ఈజీఎస్, వైఎస్సార్ క్రాంతిపథం, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖల అధికారారులు శాఖల వారీగా మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభు త్వం పనిచేస్తుందన్నారు. జడ్పీటీసీ శివాయాదవ్, వైస్ ఎంపీపీలు చింతపల్లి నన్నే, చల్లలక్ష్మయ్య (శివ), మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రమేష్, సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ జానీ, డిప్యూటీ తహసీల్దార్ సరోజ పాల్గొన్నారు.